# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

**- ఎంపీ గోడం నగేశ్**

**దిశ సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్ష**



ఆదిలాబాద్ :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలును వేగవంతం చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆదిలాబాద్ కలెక్టరేట్‌లో శనివారం ఎంపీ గోడం నగేశ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఐటిడిఏ పీవో మంద మకరందు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనుష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి పనులు, భౌతిక, ఆర్థిక పురోగతి, పెండింగ్ పనులపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. గ్రామీణాభివృద్ధి, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, వ్యవసాయం, విద్యుత్, వైద్య ఆరోగ్యం, విద్య, మహిళా-శిశు సంక్షేమం, ఉద్యానవనం, అటవీ, గిరిజన సంక్షేమం, పౌర సరఫరాలు, బీఎస్ఎన్ఎల్, జాతీయ రహదారులు తదితర శాఖల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ కేంద్ర నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం వర్కింగ్ సీజన్ కావడంతో లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహార కార్యక్రమాలు నాణ్యంగా అమలయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశం నిర్వహించి జిల్లాలోని సమస్యలను సమీక్షించి పరిష్కరించాలని తెలిపారు. దిశ సమావేశంలో గ్రామీణ సేవలు, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టిఉపాధి హామీ కింద అర్హులైన ప్రతి జాబ్‌కార్డు దారుకు ఉపాధి కల్పించాలని, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లు, అటవీ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, రేషన్ బియ్యం పంపిణీ పారదర్శకంగా చేపట్టాలని ఎంపీ ఆదేశించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో సమాన పనిదినాలు, సమాన వేతనం అమలు చేయాలని, రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అటవీ అనుమతుల సమస్యలను పరిష్కరించాలని, నిర్మాణాల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. అలాగే జాతీయ రహదారులపై ప్రమాదకర బ్లాక్‌స్పాట్లను గుర్తించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్‌డీవో రాథోడ్ రవీందర్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# సీఎం,ఎమ్మెల్యే,మంత్రుల చిత్రపటాలకు పలాభిషేకం

జన్నారం, జూలై 4(వుదయం విలేఖరి) రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు పథకంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా శనివారం జన్నారం అంబేద్కర్ విగ్రహం వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షులు నందు నాయక్,ఇతర నాయకులు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు వివేక్ వెంకటస్వామి, జూపల్లి కృష్ణారావు,సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..రైతు బంధు నిధులు,హ్యాం రోడ్ల మంజూరుతో రైతులకు, గ్రామీణ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు మంద రాజేష్, పోనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, సీనియర్ నాయకులు ఇసాక్, మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కవ్వాల్ సర్పంచ్ సక్రు నాయక్,రోటిగూడ ఉపసర్పంచ్ గాజుల సత్తన్న, మాజీ ఏఎంసి చైర్మన్ ముత్యం సతీష్,నాయకులు మల్క లక్ష్మణ్,ముజ్జు,రాగుల శంకర్, లక్ష్మణ్, గంగాధర్, రియాజుద్దీన్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# గోపాల్‌పేట్ మోడల్ స్కూల్‌లో 'స్వాగత్' వేడుకలు



నాగిరెడ్డిపేట,వుదయం గోపాల్‌పేట్ తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో కొత్తగా చేరిన విద్యార్థులకు 'స్వాగత్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డీఎల్‌పీఓ సురేందర్, గోపాలపేట గ్రామ సర్పంచ్ వంశీకృష్ణ గౌడ్, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. దాత పేరుపల్లి సాయిబాబా విద్యా సేవలను కొనియాడుతూ ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఐఐఐటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించడంతో పాటు జి. ఆద్యను 'ప్రిన్సెస్ ఆఫ్ ది ఇయర్', ఫుర్ఖాన్‌ను 'ప్రిన్స్ ఆఫ్ ది ఇయర్'గా ప్రకటించారు. కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనలు, పీటీఎం సమావేశం, విద్యార్థులకు ప్రత్యేక భోజనం, పెన్నులు, చాక్లెట్లు పంపిణీ చేశారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన నోడల్ అధికారి

కామారెడ్డి, జూలై 4 (వుదయం ప్రతినిధి):కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం శనివారం కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అడ్మిషన్స్ ను పర్యవేక్షించారు. తరగతి గదులకు వెళ్లి మొదటి సంవత్సరం విద్యార్థులతో నేరుగా సంభాషించారు. విద్యార్థుల ప్రవేశాలను పెంచాలని, బోధన సరిగా చెయ్యాలని అధ్యాపకులకు ఆదేశించారు. ఆయన వెంట ఇంచార్జ్ ప్రిన్సిపాల్ పి. సంతోష్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాలు లేవు

**ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు**





కామారెడ్డి, జూలై 4 (వుదయం ప్రతినిధి):కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్ పల్లి గ్రామంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో తెలంగాణ యూనివర్సిటీ దక్షిణ ప్రాంగణం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, గ్రామ యువకులు 40 మంది రక్తదానం చేయడం జరిగిందని రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త, ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు శనివారం తెలియజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ, రక్తానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని లేవని మానవత్వంతో రక్తదానానికి ముందుకు రావాలన్నారు. తలసేమియా వ్యాధి అవగాహనకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. గ్రామంలో మొట్టమొదటిసారిగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డికి, దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ గౌడ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ అంజయ్య గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, యువజన సంఘాలకు రెడ్ క్రాస్ తరఫున అభినందనలు తెలియజేయడం జరిగింది. ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందజేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామని అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారు తమను సంప్రదిస్తే వారికి కావాల్సిన రక్తాన్ని అందజేస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ నారాయణ, డాక్టర్ హరిత, డాక్టర్ సరిత, డాక్టర్ ప్రతిజ్ఞ, డాక్టర్ నాగరాజు, డాక్టర్ మోహన్ బాబు,డాక్టర్ సబిత, డాక్టర్ సంతోష్ గౌడ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# తెలంగాణ సాయుధ పోరాట తొలి కెరటం దొడ్డి కొమరయ్య

**ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్**



కామారెడ్డి, జూలై 4 (వుదయం ప్రతినిధి):తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వాముల అరాచకాలపై తిరగబడిన తొలి అమరుడు, వీరయోధుడు దొడ్డి కొమరయ్య అని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల కామారెడ్డి ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ కొనియాడారు. శనివారం కళాశాలలోని బి.ఎన్. రామన్ సమావేశ మందిరంలో దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయ్ కుమార్, అధ్యాపకులు దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడిన కళాశాల ప్రిన్సిపాల్..నాటి నిజాం నిరంకుశత్వానికి, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమరయ్య ఆదర్శప్రాయమైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. నేటి తరం విద్యార్థులు ఆయన తెగువను, ధైర్యాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో జరిగే అన్యాయాలపై భయపడకుండా, క్రమశిక్షణతో కూడిన న్యాయపోరాటాలు చేస్తూ విద్యార్థులు ముందడుగు వేయాలని ఆయన సూచించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కిష్టయ్య మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో పోరుగడ్డ తెలంగాణ వేదికగా జరిగిన చారిత్రాత్మక ఉద్యమాలు, నాటి రాజకీయ పరిణామాలు మరియు వాటి ఫలితాలను విద్యార్థులకు విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన పలువురు వక్తలు... కేవలం 19 ఏళ్ల చిన్న వయసులోనే దొరల ఆగడాలకు ఎదురొడ్డి నిలిచి, ప్రాణాలర్పించిన వీరుడు దొడ్డి కొమరయ్య అని శ్లాఘించారు. ఆయన ఆశయాలను, ఆలోచనలను ప్రతి ఒక్కరూ గుండెల్లో నింపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు డాక్టర్ పి. విశ్వప్రసాద్, అంకం జయప్రకాష్, ఆయా విభాగాల అధిపతులు డాక్టర్ ఎ. సుధాకర్, డాక్టర్ దినకర్ చిన్న, ఎన్. రాములు, డాక్టర్ జి. శ్రీనివాసరావు,మానస, శ్రీవల్లి, డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, డాక్టర్ తిరుమల మల్సూర్, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షాకాల సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**- చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్**



ఆదిలాబాద్ జూలై 4 (వుదయం ప్రతినిధి):రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదిలాబాద్ మున్సిపల్ యంత్రాంగంతో సమీక్ష నిర్వహించి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కాల్వలు, డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతూ వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. అలాగే పట్టణంలోని ప్రతి వార్డులో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వన్‌టౌన్ ప్రాంతానికి ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అవికిరణ్, టూ టౌన్ ప్రాంతానికి ఆర్‌ఓ వెంకటేష్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే స్వీకరించి పరిష్కరించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 9000018842 ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భారీ వర్షాల సమయంలో వార్డు అధికారులు, శానిటేషన్ సిబ్బంది, వాటర్ సెక్షన్ సిబ్బంది, ప్రత్యేక అధికారులు అందరూ అందుబాటులో ఉండాలని, అవసరమైన యంత్రాంగం, ముఖ్యంగా జేసీబీలు సిద్ధంగా ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చైర్‌పర్సన్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్కీ డ్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

**రూ.999తో భూమి సొంతం అవుతుందా? ఇలాంటి మోసపూరిత ప్రచారాలను అస్సలు నమ్మవద్దు**

**అక్రమ లక్కీ డ్రా నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు: లక్కీ డ్రా బుక్కులు, సెల్‌ఫోన్ స్వాధీనం**

**వివరాలు వెల్లడించిన సదాశివనగర్ ఎస్సై పుష్పరాజు**






కామారెడ్డి, జూలై 4 (వుదయం ప్రతినిధి):సదాశివనగర్ గ్రామానికి చెందిన సింగరాయపల్లి రమేష్ తనకు చెందిన సర్వే నెం.108/1/2లో ఉన్న 19 గుంటల పట్టా భూమిని లక్కీ డ్రా ద్వారా విక్రయిస్తానంటూ సోషల్ మీడియా, గ్రామంలో ప్రచారం నిర్వహిస్తూ, ఒక్కో వ్యక్తి నుంచి రూ.999 చొప్పున వసూలు చేసి రసీదులు జారీ చేస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం సదాశివనగర్ పోలీసులకు అందింది.

సమాచారం అందుకున్న వెంటనే సదాశివనగర్ ఎస్సై, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే లక్కీ డ్రా స్కీం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అనుమతులకు సంబంధించిన పత్రాలు చూపించాలని కోరగా, సంబంధిత వ్యక్తి తన వద్ద ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేవని అంగీకరించాడు. దీంతో లక్కీ డ్రాకు సంబంధించిన 6 బుక్కులు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిపై సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలను ఆకర్షించే పేర్లతో నిర్వహించే అనుమతి లేని లక్కీ డ్రాలు, పెట్టుబడి పథకాలు, బహుమతి స్కీములు ఇతర మోసపూరిత కార్యక్రమాలు పూర్తిగా చట్టవిరుద్ధమైనవని తెలిపారు. "రూ.999 కట్టి లక్షల విలువైన భూమి వస్తుంది", "చిన్న పెట్టుబడితో భారీ లాభాలు", "లక్కీ డ్రాలో ఖచ్చితంగా బహుమతి" వంటి ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఇలాంటి స్కీముల వెనుక మోసం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, డబ్బు చెల్లించే ముందు తప్పనిసరిగా సంబంధిత ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా లేదా అన్నది నిర్ధారించుకోవాలని సూచించారు. అమాయక ప్రజలను లక్కీ డ్రాలు, స్కీములు లేదా ఇతర మోసపూరిత పథకాల పేరుతో మోసం చేసే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. అలాగే, ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిర్వహించే వారు మాత్రమే కాకుండా, తెలిసి వాటిలో భాగస్వామ్యం అయ్యే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు తమ పరిసరాల్లో ఇలాంటి అక్రమ లక్కీ డ్రాలు, మోసపూరిత స్కీములు లేదా అనుమానాస్పద ఆర్థిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా జిల్లా పోలీసులకు సమాచారం అందించి నేరాల నియంత్రణలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

# కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంతో ప్రజలకు మరింత చేరువైన కామారెడ్డి పోలీసులు

***అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు***

***121 ద్విచక్రవాహనాలు, 36 ఆటోలు, 2 కార్లు, ఒక తల్వార్, 18 బీర్ బాటిళ్లు, 12 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం***

***కత్తులు, మారణాయుధాలతో సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు***

***గంజాయి, సైబర్ మోసాలు, రోడ్డు భద్రత, ప్రజల భాగస్వామ్యంపై అవగాహన***

***జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర***

కామారెడ్డి, జూలై 4 (వుదయం ప్రతినిధి)కామారెడ్డి పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద శనివారం ఉదయం కామారెడ్డి పోలీసు శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5.00 గంటల నుంచి 8.30 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో సుమారు 160 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర మాట్లాడుతూ, పోలీసు-ప్రజల మధ్య విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం, నేరాల నివారణలో ప్రజలను భాగస్వాములను చేయడమే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి పౌరుడు చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో 121 ద్విచక్ర వాహనాలు, 36 ఆటోలు, 2 కార్లు గుర్తించారు. వీటిలో 11 వాహనాలు నంబర్ ప్లేట్లు లేకుండా సంచరిస్తున్నట్లు గుర్తించారు. అలాగే 18 బీర్ బాటిళ్లు, 12 క్వార్టర్ మద్యం బాటిళ్లు, ఒక తల్వార్ స్వాధీనం చేసుకున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో కత్తులు, తల్వార్లు, ఇతర మారణాయుధాలతో ఫొటోలు, వీడియోలు పోస్టు చేసి యువతను రెచ్చగొట్టేలా లేదా ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా వ్యవహరించే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా, నిల్వ, విక్రయం, కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహాలు, రోజువారీ అలవాట్లను గమనించాలని సూచించారు. రోజులో కనీసం ఒకపూట కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేయడం ద్వారా పిల్లల ఆలోచనలు, ప్రవర్తనను అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పిల్లలలో అనుమానాస్పద మార్పులు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని సూచించారు. గంజాయి వ్యసనానికి గురైన వారి గురించి సమాచారం అందిస్తే వారికి డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్, చికిత్స అందించి సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి పోలీసు శాఖ సహకరిస్తుందని చెప్పారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగాల పేరుతో మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఓటీపీ, కేవైసీ, పెట్టుబడుల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ప్రజల సమాచారమే నేరాల ఛేదనకు బలమైన ఆయుధమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో ఇటీవల ఛేదించిన పలు తీవ్రమైన దొంగతన కేసుల్లో ప్రజలు అందించిన సమాచారం కీలకపాత్ర పోషించిందన్నారు. ఒక కేసులో పంచర్ షాపు కార్మికుడు ఇచ్చిన సమాచారం, మరో కేసులో విలేకరి అందించిన సమాచారం ఆధారంగా నిందితులను అరెస్టు చేయడం సాధ్యమైందని తెలిపారు. అందువల్ల కాలనీలు, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, దొంగతనాలు, గంజాయి లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, రాంగ్ రూట్ ప్రయాణం, డ్రంక్ అండ్ డ్రైవ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఇంటి, వ్యాపార సంస్థ వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నేరాల నియంత్రణతో పాటు నిందితులను గుర్తించడంలో అవి కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో అనుమానితులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలు, జీవనశైలిని తెలుసుకున్నారు. నేరాలకు పూర్తిగా దూరంగా ఉండి మంచి ప్రవర్తన కనబరిస్తే చట్టపరమైన నిబంధనల మేరకు షీట్ల తొలగింపును పరిశీలిస్తామని తెలిపారు. అలాగే కరాటేలో ప్రతిభ కనబరిచిన యువతను అభినందించి, క్రీడల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, కామారెడ్డి టౌన్ ఎస్‌హెచ్ఓ నరహరి, కామారెడ్డి రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, బిక్కనూర్ ఇన్‌స్పెక్టర్ నరేష్, ఆర్ఐలు సంతోష్, నవీన్, కృష్ణ, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

